క్లుప్తంగా

వైభవంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

పెనుగొండ: సిద్ధాంతంలో ప్రసిద్ధి చెందిన వర సిద్ధి వినాయకుని ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వర సిద్ధి వినాయకునికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గరికమాలతో అలంకరించారు. అనంతరం వివిధ పిండి వంటలతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయాభివృద్ధిక మిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.

రైతుల సమక్షంలోనే భూ రీ-సర్వే


దేవలో సర్వేయర్లకు, వీఆర్వోలకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

పెనుగొండ: రైతుల సమక్షంలో భూ-రీసర్వే ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని నరసాపురం ఆర్డీఓ దాసిరాజు ఆదేశించారు. బుధవారం పెనుగొండ మండలం దేవలో సర్వేను పరిశీలించారు. అనంతరం రీ-సర్వేపై సర్వేయర్లకు, వీఆర్వోలకు పలు సూచనలు చేశారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.అనితకుమారి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుని సంబరం


పెనుగొండ దొంగ గూడెంలో వీరభద్రుని సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: స్థానిక దొంగగూడెంలో బుధవారం వీరభద్రుని సంబరం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు అభిషేకాలు నిర్వహించిన అనంతరం దొంగగూడెం నుంచి కళాశాల వద్ద శాంతి నగర్ రామాలయం వరకూ ఊరేగింపుగా వచ్చి మొక్కులు ఉన్న వారందరూ నరసాపురం కాలువలో పుణ్య స్నానాలు చేశారు. అనంతరం వీరభద్రుడిని తలపై పెట్టుకొని గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారుల ప్రత్యేక వేషధారణలు ఆకట్టుకొన్నాయి. అనంతరం ఆలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం చెక్కును అధికారులకు అందిస్తున్న దృశ్యం

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిత్యాన్నదాన నిర్వహణకు బెంగుళూరు యలహంకకు చెందిన వాసవీ భక్తురాలు బి.వాసవాంబ విరాళాన్ని అందించారు. బుధవారం దేవస్థానం కార్యాలయంలో రూ.1,00,116 చెక్కును అందించారు. శాశ్వత నిత్యాన్నదానం నిర్వహణకు సహకరించిన దాతకు దేవస్థానం అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని శిక్షించాలి


రూరల్ సీఐకు ఫిర్యాదును అందజేస్తున్న శెట్టిబలిజ సామాజిక వర్గం నాయకులు

నరసాపురం రూరల్: శెట్టిబలిజ కులాన్ని, ఆ సామాజికవర్గ మహిళలను కించ పరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు బుధవారం రూరల్ సీఐ దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. తమ జాతి పితామహుడైన దొమ్మేటి వెంకటరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వెంటనే నిందితులపై చర్యలు తీసుకోవాలని శెట్టిబలిజ సంఘం నాయకులు కోరారు.

మావుళ్లమ్మ సేవలో కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం భీమవరం మావుళ్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు మల్లికార్జున శర్మ కలెక్టర్‌కు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు.

విశిష్ట సంఖ్యతో ఎన్నో లాభాలు

- వ్యవసాయానికి ఎంతో కీలకం
- సొంత భూమి ఉన్న రైతులే అర్హులు
- రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభమైన నమోదు ప్రక్రియ


కాజ రైతు సేవా కేంద్రంలో రైతులకు విశిష్ట సంఖ్య నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి: ఆధార్ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగుభూమి ఉన్న ప్రతి రైతుకూ 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. భవిష్యత్‌లో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.

సాగు వివరాలు

మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీల్లో వివిధ పంటలు సాగు చేశారు. ముఖ్యంగా వరి, కొబ్బరి, అరటి, చెరకు, తమలపాకు తదితర పంటలు సాగవుతున్నాయి. మండలంలో 12 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా దాదాపు 6500 మంది సొంత భూమి ఉన్న రైతులు ఉన్నారు. వీరంతా విశిష్ట సంఖ్య కోసం నమోదు చేయించుకోవాల్సి ఉంది. సొంత పొలం ఉన్న రైతులందరూ అధికారులు సూచించిన ధ్రువపత్రాలతో స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే నమోదు చేసుకుంటారు.

అవసరమైన పత్రాలు

విశిష్ట సంఖ్య నమోదుకు రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, లేదా వన్-బీ, ఆధార్ లింకైన మొబైల్ నంబర్ అవసరం. వీటిని తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళితే వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతు ఆధార్ లింక్ మొబైల్ నంబరుకు మూడు సార్లు ఓటీపీలు వస్తాయి. వాటిని ఎంటర్ చేసి, రైతు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తును పూర్తి చేయాలి.

ప్రయోజనాలివే..

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, బిందు సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలను నేరుగా పొందే వీలు కలుగుతుంది. అలాగే పంట నష్ట పరిహారం సత్వరం పొందేందుకు ఉపయోగపడుతుంది. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు పొందడానికి తోడ్పడుతుంది.

ప్రతి రైతూ నమోదు చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతూ తమ వివరాలు నమోదు చేయించుకుని, విశిష్ట సంఖ్య పొందాలి. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఇంతవరకు 3200 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మిగిలిన రైతులు ఈ నెల 28 లోపు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

– చిందులూరి దేవి, మండల వ్యవసాయ అధికారి, యలమంచిలి

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లోని రైతులందరికీ విశిష్ట సంఖ్య నమోదు, ప్రయోజనాల పై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి నమోదు చేసుకుంటున్నారు. ప్రతి రైతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందాలంటే విశిష్ట సంఖ్య ఎంతో అవసరం. పొలం ఉన్న ప్రతి రైతూ నమోదు చేసుకోవాలి. ప్రభుత్వ పథకాలను ఈ ఐడీ ద్వారా రైతులు పొందే అవకాశం ఉంటుంది.

– కొంబత్తుల నాగలక్ష్మి, వీఏఏ, మేడపాడు

కౌలు రైతులకు అన్యాయం



కౌలు రైతులకు ఈ విశిష్ట సంఖ్య నమోదు చేయకపోవడం అన్యాయం. గతంలో సొంత భూమి ఉన్నవారితో పాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందేది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల మంజూరుకు విశిష్ట సంఖ్య మెలిక పెట్టడం, అది కూడా సొంత భూమి ఉన్న రైతులకే విశిష్ట సంఖ్య నమోదు చేయడమంటే అన్నదాత సుఖీభవ పథకానికి కౌలు రైతులను దూరం చేయడమే. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి పథకాలన్నీ ఆగిపోయాయి.

– పాకా సూర్యనారాయణ, పెనుమద్రు

మల్లవరంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు


మల్లవరంలో మట్టి తవ్వకాలు చేస్తున్న దృశ్యం


మల్లవరంలో రహదారి దుస్థితి

- పట్టించుకోని అధికారులు
- ఛిద్రమవుతున్న రోడ్లు

నరసాపురం రూరల్: నరసాపురం, వీరవాసరం, పాలకొల్లు మండలాల సరిహద్దు గ్రామమైన మల్లవరం గ్రామంలో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయమై రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా తమ దృష్టికి రాలేదని ఎప్పటిలాగే పాత పాటే పాడుతున్నారు. భారీ యంత్రాలతో యథేచ్ఛగా మట్టి తవ్వుతూ లారీల ద్వారా మట్టిని వీరవాసరం తరలిస్తున్నారు. లారీలు ఒకదాని వెంట ఒకటి వేగంగా వెళ్తుండడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని రోడ్డుపై ప్రయాణించేవారు ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా సామర్థ్యానికి మించి మట్టిలోడు లారీలు ప్రయాణిస్తుండటంతో మత్స్యపురి వంతెన సమీపంలో మల్లవరం గ్రామంలోకి వచ్చే రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. మల్లవరం, మల్లవరం లంక గ్రామాల ప్రజలు, రైతులు భీమవరం వెళ్లేందుకు ఈ మార్గం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఆందోళనకు దిగుతున్న ప్రజలు

ప్రస్తుత సర్పంచ్ సంధి సుజాత ఇటీవల రైతులు, గ్రామస్తులతో కలిసి మట్టి రవాణా వాహనాలను అడ్డుకున్నట్లు సమాచారం. దీంతో మట్టి కాంట్రాక్టర్ మల్లవరంలోని మట్టి తవ్వకం పనులు పూర్తయిన తరువాత ఈ రోడ్డు మరమ్మతుల కోసం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి రూ.50వే లు చెల్లించినట్లు సమాచారం. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ రోడ్డును మట్టి మాఫియా తమ స్వార్థం కోసం ఛిద్రం చేసి మరమ్మత్తులు కోసం రూ.50 వేలు ఇవ్వడం ఎంత వరకూ సమంజం? అని మల్లవరం గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే డివిజన్, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మల్లవరంలో యథేచ్ఛగా జరుగుతున్న మట్టి తవ్వకాలను నిలుపుదల చేసి గ్రామాలలోని రోడ్లు పాడవకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి



గ్రామంలో నా హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మించాం. అయితే ఇటీవల మట్టి మాఫియా గ్రామంలో మట్టి ట్రాక్టర్లు, లారీలతో యథేచ్ఛగా నిబంధనలను తుంగలోకి తొక్కి మట్టిని తీసుకుని వెళ్లడంతో రోడ్లన్నీ పాడయ్యాయి. దీనికి బాధ్యులైన మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి.

– ఏలూరి ప్రసాద్, మాజీ సర్పంచ్, మల్లవరం

వాహనాలు పాడవుతున్నాయి



మట్టి తవ్వకందారులు నిబంధనలు మరచి యథేచ్ఛగా సామర్థ్యానికి మించి ట్రాక్టర్లు, లారీలతో మట్టిని తీసుకుని వెళ్లడంతో మా గ్రామంలో రోడ్లు పాడయ్యాయి. అంతే కాకుండా ఈ వాహనాలు అతి వేగంగా వెళ్లడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. పాడైన ఈ రోడ్లపై ప్రయాణంతో మా ఆటోలు, స్కూల్ పిల్లలను తీసుకు వచ్చే బస్సులు, ఇతర వాహనాలు తరచూ పాడవుతున్నాయి.

– గంటా విజయ్, ఆటో డ్రైవర్, మల్లవరం

వైభవంగా మావుళ్లమ్మ గ్రామోత్సవం


జుత్తిగలో అమ్మవారి గ్రామోత్సవంలో ఆకట్టుకున్న వేషధారణలు

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ గ్రామంలో పంటపొలాల్లో ఉన్న శ్రీమావుళ్లమ్మ వారి ఆలయ 19వ వార్షిక మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన, తీర్థ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యుడు, గ్రామ సర్పంచ్ తమనంపూడి వీరిరెడ్డి తెలిపారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పొలాల్లో ఉన్న ఉత్సవమూర్తి మావుళ్లమ్మ అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఉంచి మేళతాళాలు, బుట్టబొమ్మలతో గ్రామోత్సవం అత్యంత వైభవంగా చేశారు. గురువారం నుంచి చండీ సప్త శతి హోమం, లక్ష కుంకుమార్చన, 21న సహస్రనామ కుంకుమార్చన, 22న పోతురాజును బోనాల ఉత్సవంతో అమ్మవారి ఆలయానికి తీసుకురావడం, 23న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటి స్థలం లేని నిరుపేదలకు పట్టణంలో అయితే రెండు సెంట్లు, గ్రామాల్లో అయితే మూడు మూడు సెంట్లు భూమిని ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. పాలకొల్లు తహసిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇల్లు లేని నిరుపేదల నుంచి ఇంటి స్థలం కోసం అర్జీలను పూర్తి చేయించి, అక్కడికక్కడే వాటిని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు అద్దె ఇళ్లలో ఉంటూ, నెలకు 5 నుంచి 6 వేల రూపాయలు అద్దెను చెల్లిస్తున్నారన్నారు. దీంతో రుణ భారం పెరిగి, కుటుంబాన్ని పోషించుకోలేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీసం ఒక సెంటు భూమిని కూడా కొనుక్కోలేని దుస్థితిలో పేదలు ఉన్నారన్నారు. నిరుపేదలకు కూడు గూడు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇట్టి స్థలం ఇవ్వడంతో పాటు నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం కూడా చేస్తామని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిందని, దీనిని రాష్ట్ర మంత్రి వర్గంలో సైతం ఆమోదించారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని, పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు అందజేసి వారిని అన్ని విధాలా ఆదుకోవాలని భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే పేదల పక్షాన సీపీఐ నిలబడి ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. మార్చి 15న భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి ఇళ్ల స్థలాల వ్యక్తిగత అర్జీలు స్వయంగా కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సీహెచ్ సుందర్ పేదలు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు, లబ్ధిదారులు

తాగునీటి ప్లాంట్ ప్రారంభం


నత్తారామేశ్వరంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పెనుమంట్ర గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు సత్తి శ్రీనివాసరెడ్డి రూ.3.50 లక్షలతో నిర్మించిన ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటర్ ప్లాంట్ దాతలు రిటైర్డ్ ఏఎస్సై సత్తి నాగిరెడ్డి మహాలక్ష్మి, ప్రవాస భారతీయులు సత్తి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీతేజ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్లాంటును ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేదుకు ఈ ప్లాంట్‌ను నిర్మించి ఆలయానికి అప్పగించారు. కార్యక్రమంలో ఈఓ ఏళ్ల సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు తమనంపూడి నాగ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు పొందాలంటే గుర్తింపు సంఖ్య తప్పనిసరి


రైతు గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

నరసాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీ పథకాలు రైతులకు అందాలంటే తప్పనిసరిగా 14 అంకెల గుర్తింపు సంఖ్య రైతులు నమోదు చేయించుకోవాలని నరసాపురం ఏడీఏ ఈదా అనిలకుమారి అన్నారు. బుధవారం నరసాపురంలోని ఏడీఏ కార్యాలయంలో రైతు గుర్తింపు సంఖ్య నమోదును కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసాపురం మండలంలో 6,375 మంది రైతులకు గాను 2,519 మంది గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారన్నారు. అలాగే యలమంచిలి మండలంలో 4,802 మంది రైతులకు గాను 2,913 మంది రైతులు, మొగల్తూరు మండలంలోని 2,230 మంది రైతులకు గాను 835 మంది రైతులు గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకున్నారన్నారు. ఈమె వెంట వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మీనారాయణ, వీఏఏ సురేష్‌కుమార్, వీఏఏ శ్రీనివాస్ దొర తదితరులు ఉన్నారు.

నాటుసారాతో అనర్థాలు


సోదాలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నరసాపురం రూరల్: నాటుసారా సేవించడంతో అనేక అనర్థాలు కలుగుతాయని, నాటుసారా తయారీ, విక్రయం నేరమని నరసాపురం ఎక్సైజ్ సీఐ రాంబాబు అన్నారు. బుధవారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని మొగల్తూరు మండలంలో సీఐ రాంబాబు ప్రారంభించారు. సారా తయారీ అనుమానిత ప్రాంతాలు, మొగల్తూరు, కుక్కలవారితోట, ముత్యాలపల్లి, కట్టావారిమెరక గ్రామాల్లో దాడులు నిర్వహించి సారా విక్రయించే అనుమానిత వ్యక్తులను కలిసి సారా వల్లకలిగే నష్టాలను గురించి వివరించారు. సారా తయారీ విక్రయాల గురించి సమాచారం తెలిసిన వారు 94409 02438 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: నేటి యువత ఛత్రపతి శివాజీ ధైర్య, సాహసాలను తెలుసుకోవాలని పాలకొల్లు జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ శివాజీ సేవలను కొనియాడారు.

తపాలా బీమా చెక్కు పంపిణీ

వీరవాసరం: ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అందుకు పోస్టల్ శాఖ అందిస్తున్న పిఎల్ఐ – ఆర్‌పిఎల్ఐ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం తపాలా శాఖా సీనియర్ సూపరింటెండెంట్ కే. హరికృష్ణ ప్రసాద్ తెలిపారు. వీరవాసరం మండలంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి గ్రామస్తులకు పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. ఇటీవల ఆకస్మికంగా మరణించిన తపాలా బీమాదారుడు పెంటకోటి రాంబాబు కుటుంబానికి రూ.5,43,439 చెక్కు అందజేశారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు సామూహిక ఎలుకల నిర్మూలన

ఉండి: సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం ప్రతి రైతూ తమ పొలంలోని ఎలుకల బొరియలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చివేయాలని అన్నారు. ఇలా పూడ్చివేయడం ద్వారా బొరియల్లో ఎలుకలు ఉంటే వాటిని తిరిగి తెరుస్తాయని పేర్కొన్నారు. ఆ తెరిచిన బొరియల్లో శుక్రవారం రైతు సేవాల కేంద్రాల వద్ద ప్రభుత్వం అందించే బ్రోమోడయోలిన్ మందును చిన్న చిన్న పొట్లాలుగా కట్టి వేయాలని, అలాగే మళ్లీ ఆ బొరియలను మట్టితో పూడ్చివేయాలని వివరించారు.

వెలగని వీధి దీపాలు

నరసాపురం: పట్టణంలోని 31వవార్డు చినమామిడిపల్లి నాగారమ్మకాలువగట్టు రోడ్డు వెంబడి వీధి దీపాలు గత 20 రోజులుగా వెలగడం లేదు. దీంతో రాత్రిపూట ఆ ప్రాంతం వారు ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపల్ అధికారులకు చెప్పినా కూడా పట్టించుకోవడంలేదని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట చర్యలు



టేలర్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీ శ్రీవేద

నరసాపురం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి పటిష్ట చర్యలు చేపడుతున్నామని నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద తెలిపారు. బుధవారం ఆమె పట్టణంలో ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితి, ఎంతమంది ఓటర్లు ఉన్నారు? ఏ మేరకు బందోబస్తు అవసరం అనే అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు ఏర్పాటుకు రెవెన్యూ శాఖతో కలిసి చర్యలు చేపడతామని చెప్పారు. ఆయన నరసాపురం పట్టణ సీఐ బి.యాదగిరి తదితరులు ఉన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



కొడమంచిలిలో పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని డీవైఎఫ్‌వై జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శర్మ అన్నారు. బుధవారం కొడమంచిలిలో ప్రజా సంఘాల నాయకులు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మద్దతుగా కొడమంచిలిలో ప్రచారం నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడానికి పీడీఎఫ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.మోహనరావు, బండి రంగారావు, కమల్,ఎల్లమల్లి కృష్ణమూర్తి, కాశి రుద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.